సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



ఒగ్గు విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఒగ్గుడోలు మురిసింది.. శిక్షణ అదిరింది

ఒగ్గుడోలు శిక్షణలో విద్యార్థులు అద్భుతంగా రాణించారు. చండీశ్వర ఒగ్గు కళాసేవా సమితి మాణి క్యపురం ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒగ్గుడోలు శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. పది రోజులు పాటు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో ఒగ్గుడోలు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మయ్య పాల్గొని మాట్లాడారు. మొదటి సారిగా కళాశాల స్థాయిలో అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు ఒగ్గుడోలు నేర్పించడం గొప్ప పరిణామమని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కళారూపాల్లో విద్యార్థులు ప్రావీణ్యం పెంపొం దించుకోవాలని అన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

- సిద్దిపేట ఎడ్యుకేషన్

న్యూస్‌రీల్

గోటి తలంబ్రాలు అప్పగింత



భద్రాచల దేవస్థానంలో గోటి తలంబ్రాలను అందజేస్తున్న రామకోటి రామరాజు తదితరులు

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్తసమాజం ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీ యమని భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి అన్నారు. గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్తస మాజం సిద్ధం చేసిన గోటి తలంబ్రాలను (150 కిలోల వడ్లను) సోమవారం భద్రాచలం లో దేవస్థానంలో అప్పగించారు. ఈ సంద ర్భంగా ఈఓ మాట్లాడుతూ భక్తులలో ఆధ్యా త్మిక భావనను పెంపొందిస్తూ రామకోటి భక్త సమాజం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టపైకి వేంచేసిన లక్ష్మీనృసింహుడు



ఉత్సవ మూర్తుల ఊరేగింపులో భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గ్రామం లోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఉత్సవమూర్తు లను సోమవారం గుట్టపైకి మేలతాళాలు, కోలాటాలతో రథంపై తీసుకెళ్లారు. ఏటా బ్రహ్మోత్సవాలకు గ్రామంలోని ఆలయం నుం చి గుట్టపైకి స్వామి వారి ఉత్సవ మూర్తులను తీసుకెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ అని అర్చకుడు మధుసూదనాచారి తెలిపారు. కార్య క్రమంలో ఎండోమెంట్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న వన్ టౌన్ సీఐ, పోలీసులు

సిద్దిపేటకమాన్: పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబా బు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణం లోని కాంచిట్ చౌరస్తా సమీపంలో సీఐ, ఎస్ఐ నరసింహారావు, తమ సిబ్బందితో కలిసి సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా లక్ష రూపా యలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అంతా అనుకున్నట్లుగానే..

కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి



మదన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి

నర్సాపూర్: అంతా అనుకున్నట్లుగానే మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చు కున్నారు. గత నెల చివరి వారం నుంచి కాంగ్రె స్‌లో చేరేందుకు ముమ్మర ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిని సైతం కలిసి పార్టీలో చేరే అంశంపై చర్చించారు. కాగా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షం లో కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించినా అవకాశం కుదరకపోవడంతో చివరికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి, మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో సోమవారం కాంగ్రె స్‌లో చేరారు. ఆయన వెంట నర్సాపూర్ పీఏసీ ఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ ఎంపీపీ అధ్య క్షురాలు లలిత, ఎంపీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ హబీబ్‌ఖాన్, కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి, శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కౌడిపల్లి మాజీ ఎంపీపీ పద్మ, చిలప్‌చెడ్ ఎంపీపీ అధ్యక్షురాలు వినోద, కొల్చారం ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ సావిత్రి, హత్నూర బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డితో పాటు పలువురు మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజ కవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి తెలిపారు.

జోరుగా రీ ఫిల్లింగ్

సబ్సిడీ వంటగ్యాస్ అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా మినీ సిలిండర్లు, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లలో రీ ఫిల్లింగ్ చేస్తూ దందా సాగిస్తున్నారు. కొంత మంది వ్యాపారులు బ్లాక్‌లో కొనుగోలు చేసి తమ వ్యాపారానికి వినియోగిస్తున్నారు. ఇంకొందరు అందులోని గ్యాస్‌ను మినీ సిలిండర్లలో నింపి విక్రయిస్తున్నారు. అక్రమ దందా యథేచ్ఛగా జిల్లా వ్యాప్తంగా సాగుతున్నా సివిల్ సప్లయ్ అధికారులు దృష్టిసారించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



సబ్సిడీ గ్యాస్ వాణిజ్య అవసరాలకు వినియోగం

యథేచ్ఛగా గ్యాస్ అక్రమ దందా

- సబ్సిడీ పక్కదారి
- కమర్షియల్, మినీ సిలిండర్లలోకి ఫిల్లింగ్
- బహిరంగంగానే విక్రయాలు
- పట్టించుకోని సివిల్ సప్లయ్ అధికారులు

సాక్షి, సిద్దిపేట: జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల పట్టణ కేంద్రాల్లో సబ్సిడీ గ్యాస్ రీ ఫిల్లింగ్ దందా జోరుగా సాగుతోంది. జనా వాసాల నడుమ అక్రమదందా నడుస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థాని కులు ఆందోళన చెందుతున్నారు. కేజీ గ్యాస్ రూ.125లకు చొప్పున విక్రయిస్తున్నారు. ఒక్కో సిలిండర్‌లో 2 నుంచి 3 కేజీల గ్యాస్‌ను నింపుతు న్నారు. ముఖ్యంగా సిద్దిపేట, గజ్వేల్‌లోని పలు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, గ్యాస్ డెలివరీ చేసే వ్యక్తులు అక్రమార్జనకు తెరలేపి సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపి స్తున్నాయి.

సబ్సిడీ పెరగడంతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుం డటంతో రీ ఫిల్లింగ్ దందా ఉధృతంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్‌ను తక్కువగా వినియోగించుకునే వారిని గ్యాస్ డెలివరీ బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు గుర్తించి వారిచే గ్యాస్ బుక్ చేపిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీని మీరే తీసుకోండి అని వినియోగదా రులకు ఆఫర్ ఇచ్చి గాలం వేస్తున్నారు. దీంతో వారి వైపు మొగ్గు చూపి గ్యాస్ బుక్ చేస్తున్నారు. ఇలా వచ్చిన గ్యాస్ సిలిండర్‌ను రీ ఫిల్లింగ్, వాణిజ్య అవ సరాలకు వినియోగించేవారికి రూ.1,100లకు విక్రయిస్తున్నారు. వీరి అక్రమాలపై నిఘా పెట్టి నియంత్రించాల్సిన అధికారులు ముడుపులు తీసుకుని పట్టించుకోవడం లేదనే ఆరోప ణలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రం గా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు విని పిస్తున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం

గ్యాస్ రీ ఫిల్లింగ్ చేస్తున్న వారి పై కేసులు నమోదు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. సబ్సిడీ గ్యాస్ వాణిజ్య అవ సరాలకు వినియోగించవద్దు, చిన్న సిలిండ ర్లలో నింపవద్దు. అలా చేయడం నేరం.

– తనూజ, డీఎస్ఓ

మినీ సిలిండర్లు బహిరంగంగా విక్రయాలు



హుస్నాబాద్‌లో మినీ గ్యాస్ సిలిండర్లు విక్రయించే షాప్‌లో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు

పట్టణ, మండల కేంద్రాలలో మినీ గ్యాస్ సిలిండర్ల విక్రయాలు బహిరంగంగానే ఈ వ్యాపారాన్ని కొనసాగి స్తున్నారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్‌లోని గ్యాస్‌ను రీ ఫిల్లింగ్ చేసి హైదరాబా ద్‌కు సరఫరా చేస్తున్నారు. జనావాసాల మధ్య అక్రమ దందా నిర్వహిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మినీ సిలిండ ర్లను వినియోగించవద్దని, రీ ఫిల్లింగ్ చేసే సమయంలో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డెలివరీ బాయ్స్‌పై కేసు నమోదు



వివరాలు సేకరిస్తున్న డీసీఎస్ఓ తనూజ

రాయపోలు(దుబ్బాక): వంటగ్యాస్ డొమెస్టిక్ సిలిం డర్లలోంచి కమర్షియల్ సిలిండర్‌లలోకి గ్యాస్ రీఫిల్ చేసిన ఉదంతంపై అధికారులు విచారణ చేప ట్టారు. సోమవారం జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి తనూజ తన సిబ్బందితో రాయపోలులోని సదరు కార్యాలయం, గోదాంలను సందర్శిం చారు. రికార్డులను పరిశీలించి రీఫిల్ చేస్తున్న సిలిండర్లను సీజ్ చేశారు. నిండుగా ఉన్న 11కమర్షియల్ సిలిండర్లు, సగం నింపిన మరో 64 సిలిండర్లు, 561 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అలాగే ఇద్దరు డెలివరీ బాయ్స్‌పై కేసు నమోదు చేశామని, ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలుంటాయని తనూజ తెలిపారు.

అయ్యా.. ముఖ్యమంత్రి గారూ..

- హామీలు నెరవేర్చండి..
- నేటికీ బోనస్ రాలే.. రుణమాఫీ చేయలే
- సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డుల్లో రైతుల వినతి



ఉత్తరం రాస్తున్న రైతు

గౌరవనీయులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి.. మా విన్నపం.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చకపోవడంతో రాస్తున్న ఉత్తరం..

'మిమ్మలను నమ్మి ఓటేశాం. అయినా క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 బోనస్ రాలేదు. రైతు భరోసా కింద రూ.15 వేలు అందలేదు. రైతు కూలీలకు ఇస్తామన్న రూ.12 వేలు, రైతు రుణమాఫీ కింద రూ.2 లక్షల మాఫీ చేయలేదు. రైతుబీమా సరేసరి. ఎండిపోయిన పంటలకు ఇస్తామన్న రూ.25వేల నష్టపరిహారం జాడేలేదు. వీటన్నంటిని వెంటనే అమలు చేయాలని కోరుతున్నాం'. అంటూ సిద్దిపేట నియోజకవర్గ రైతులు సోమవారం సీఎం రేవంత్ రెడ్డికి పోస్టు కార్డులు రాసి వినూత్న రీతిలో ఆవేదన వ్యక్తంచేశారు. వీరికి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తదితరులు మద్దతు పలికారు.

- సిద్దిపేట జోన్

కాంగ్రెస్ మోసాలను ఎండగడతాం



రైతులతో కలిసి సీఎంకు ఉత్తరాలు పంపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు (సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. సోమవారం చిన్నకోడూరులో రైతు లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో సర్కారు మోసాలను ఎండగడతామన్నారు. రైతు బీమా వర్తింపజేయాలని, వరి ధాన్యానికి ఇస్తామన్న బోనస్ రూ.500 చెల్లించాలని, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. నీళ్లు లేక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపా ధ్యక్షుడు పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్య క్షుడు కాముని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

దైవ చింతనతో ముక్తి



మాట్లాడుతున్న కాశీనాథ్ బాబా

హత్నూర(సంగారెడ్డి): దైవచింతనతో ముక్తి లభిస్తుందని పంచదామ పీఠాధిపతి కాశీనాథ్ బాబా అన్నారు. సోమవారం మండల పరిధిలోని నస్తీపూర్ రామాలయంలో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్స వాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తి మార్గంలోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

ఏపీఓ నర్సింగరావును బర్తరఫ్ చేయండి

కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటరూరల్: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిం చిన ఏపీఓ నర్సింగరావును విధుల నుంచి బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇ మామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడారు. బీఆర్ ఎస్ అభ్యర్థి వెంకట్రామరెడ్డి ఉద్యోగులతో ఇటీవల సమావేశమైన క్రమంలో 106 మంది ఉద్యోగులను గుర్తించి సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే. ఇం దులో కొంతమంది ఉద్యోగులు తప్పించుకున్నార ని, ఏపీవో నర్సింగరావు పదిమంది ఉద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని సస్పెన్షన్ చేయకుండా అడ్డువచ్చారని ఆరోపించారు. నర్సింగ రావుతోపాటు సమావేశంలో పాల్గొన్న ఉద్యోగు లపై విచారణ చేయించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ ప్రధాన కార్యదర్శి గ్యాదారి మధు, పట్టణ యువ జన కాంగ్రెస్ అధ్యక్షుడు గాయసుద్దీన్, ఎస్ఎ స్‌యుఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషద్ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్

డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: వేసవి దృష్ట్యా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో ఓఆర్ఎస్‌లు, ఐవీ ఫ్లూయిడ్స్ అందు బాటులో ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాల యంలో స్టాఫ్ నర్సులు, సీనియర్ నర్సింగ్ అధికా రులతో డీఎంహెచ్ఓ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అన్ని ఆరోగ్య కార్యక్ర మాల్లో పాల్గొనాలన్నారు. ప్రతి బుధవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించాలన్నారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన క్షయ, డయాబెటీస్, బీపీ, ఎన్‌సీడీ కేసులు, స్క్రీనింగ్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలి పారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిం చాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్‌బా బ్జీ, డాక్టర్ విజయరాణి, డాక్టర్ రజని, డాక్టర్ శ్రీదే వి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభకు సర్వం సిద్ధం

- సుల్తాన్‌పూర్‌లో నేడు బీఆర్ఎస్ బహిరంగ సభ
- హాజరు కానున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన నాయకులు
- జన సమీకరణకు కసరత్తు



సుల్తాన్‌పూర్ వద్ద సభా స్థలాన్ని పరిశీలిస్తున్న చింతా ప్రభాకర్, క్రాంతి తదితరులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం సంగా రెడ్డి జిల్లాకు రానున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో జరుగనున్న బహిరంగసభలో ఆయన ప్రసంగించ నున్నారు. ఈ మేరకు గులాబీ పార్టీ శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న ఈ సభకు ఇటు మెదక్ లోక్‌సభ స్థానం పరిధిలోని అసెంబ్లీ స్థానాల నుంచి కూడా జనసమీకరణ చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో లోక్‌సభ ఎన్నికల నామినే షన్ల పర్వం షురూ కానున్న నేపథ్యంలో ఈ సభ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే గులాబీ శ్రేణులు జిల్లాలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. రెండు లోక్‌సభ స్థానాల్లో కూడా విస్తృతంగా ప్రచారం చేస్తు న్నారు. ఈ నేపథ్యంలో అధినేత బహిరంగ సభ మరింత ఊపునిస్తుందని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

రోడ్డు మార్గం ద్వారా..

కేసీఆర్ మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు బహిరంగసభ స్థలానికి చేరుకుంటారని ఆ పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. రోడ్డు మార్గం ద్వారా ఆయన సభా స్థలానికి చేరుకుంటారని, బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని చెబుతున్నారు. మండిపో తున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని సాయంత్రం వేళల్లో ఈ సభ నిర్వహించాలని నిర్ణయించారు.

భారీ జనసమీకరణే లక్ష్యం..

కేసీఆర్ హాజరుకానున్న ఈ బహిరంగ సభను గులాబీ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందు కోసం భారీగా జన సమీకరణ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. అందోల్ అసెంబ్లీ నియోజకవర్గంతో పాటు, సంగారెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనాలను తరలించాలని భావి స్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 20 వేలకు పైగా జనాలను తరలించాలని చూస్తున్నారు. అలాగే నారాయణఖేడ్, జహీరాబాద్, పటాన్‌చెరు నియోజ కవర్గాల నుంచి కూడా పార్టీ శ్రేణులు ఈ సభకు తర లిరానున్నారు. ఈ మేరకు అన్ని గ్రామాలకు వాహన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.

విజయవంతం చేయండి: చింతా

బహిరంగసభ స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిర ణ్‌లు సోమవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు హాజరయ్యే ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ బహి రంగసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని కోరారు.

క్లుప్తంగా

పాట ఆవిష్కరణ



మంత్రి దామోదరతో మధుప్రియ, నీలం మధు

పటాన్‌చెరు: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కోసం సింగర్ మధు ప్రియ 'అన్న కోసం చెల్లెలు పాడిన' పాటను మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు మండలం చిట్కూల్‌లో నీలం మధు కార్యాలయంలో మంత్రి సింగర్ మధు ప్రియతో కలిసి పాటను ప్రారంభించారు.

వడదెబ్బపై అవగాహన కలిగించాలి

- డీఎంహెచ్‌ఓ డా.శ్రీనివాస్
- మిరుదొడ్డి పీహెచ్‌సీ కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

మిరుదొడ్డి(దుబ్బాక): జిల్లాలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై ప్రజలకు అవగాహన కలిగించాలని డీఎంహెచ్‌ఓ డా. పుట్ల శ్రీనివాస్ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం మిరుదొడ్డి పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో నమోదవుతున్న రోగుల వివరాలు, గర్భిణుల ప్రసవ వివరాలతోపాటు ల్యాబ్ రికార్డులను, పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రైతులు, ఉపాధి హామీ కూలీలు, రోజువారి కూలీలు వడదెబ్బపై అవగాహన లేక ఎండలోనే పని చేస్తారన్నారు. వడదెబ్బ సోకే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వినోద్ బాబ్జీ, పీహెచ్‌సీ డా. అమీనా సుల్తానా, సీహెచ్‌ఓ లింగమూర్తి, డా.శ్రీనివాస్, సిబ్బంది రాజేశ్వర్, నసీమ, భాస్కర్, రవీందర్, రాజశేఖర్, స్వప్న, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ హెచ్చరించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలపై వైద్యం కోసం వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండలు ముదురుతున్న తరుణంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

మెట్ల పైనుంచి పడి మేస్త్రీ మృతి

పటాన్‌చెరుటౌన్: ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి పడి తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి చెందిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని బాపట్లకు చెందిన డానియల్(33) బతుకుదెరువు కోసం వచ్చి మియాపూర్‌లో ఉంటూ మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పటాన్‌చెరు మండలం పాటి గ్రామంలో నూతనంగా జయరాం రెడ్డి అనే వ్యక్తి భవనం నిర్మించాడు. ఆదివారం రాత్రి ఫంక్షన్ ఏర్పాటు చేసి మేస్త్రీలను పిలిచాడు. అక్కడికి వెళ్లిన డానియల్ మొదటి అంతస్తు మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి వెనుకకు పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి మామ కోటయ్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్యాకేజీ ఇస్తాం రండి!



ఇప్పటికే పలువురు జంప్

బీఆర్‌ఎస్‌ను వీడి పలువురు నేతలు ఇప్పటికే బీజేపీలో చేరిపోయారు. మొగుడంపల్లి జెడ్పీటీసీ అరుణ మోహన్‌రెడ్డి, మండల నాయకుడు విజయ్ మోహన్‌రెడ్డి, ఝరాసంగం మండలానికి చెందిన సీడీసీ మాజీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, కోహీర్ మండలానికి చెందిన గోవర్ధన్‌రెడ్డి, ఎం.సుభాష్‌రెడ్డి, న్యాల్‌కల్ మండలానికి చెందిన దేశెట్టి పాటిల్‌లు బీజేపీలో చేరారు.

- బీఆర్‌ఎస్‌ను టార్గెట్‌గా పెట్టుకున్న కాంగ్రెస్
- పలువురు ముఖ్య నేతలను చేర్చుకునేందుకు గాలం
- నామినేటెడ్ పదవులను ఎర!
- ఇప్పటికే కొందరు చేరిక
- గెలుపే లక్ష్యంగా వ్యూహం

జహీరాబాద్: జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు బీఆర్‌ఎస్‌ను టార్గెట్‌గా పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చడం ద్వారా ఎంపీ స్థానాన్ని చేజిక్కించుకోవచ్చనే యోచనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. అందులో భాగంగానే జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న ముఖ్యనేతలకు కాంగ్రెస్ గాలం వేస్తోంది. సరికొత్త ప్యాకేజీలు, నామినేటెడ్ పదవులను ఎర వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ప్రధానంగా గతంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికే మొదటగా ఆఫర్ పెట్టినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ స్థానంలో బీఆర్‌ఎస్ సుమారు 12 వేల మెజార్టీతో గెలుపొందడం జరిగింది. అయినా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున పార్టీ నేతలు ప్రతిపక్షాన్ని వీడే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

అంతా మళ్లీ సొంత గూటికి..

జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో పలువురు మున్సిపల్ మాజీ చైర్మన్లు, పలువురు మాజీ సర్పంచ్‌లు, పలువురు మాజీ కౌన్సిలర్లు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుకోవాలనే ఆశతో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. గతంలో జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న ఫరీదుద్దీన్ రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్‌లో మాజీ మంత్రి జె.గీతారెడ్డితో పొసగక పోవడం వల్ల పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఫరీదుద్దీన్‌తోపాటు ఆయన అనుచరులంతా బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. ఫరీదుద్దీన్ మరణానంతరం ఆయన అనుయాయులకు పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందనే ప్రచారం సాగింది. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన తనయుడు ఎం.డీ తన్వీర్‌కు టీఎస్ఐడీసీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ప్రస్తుతం తన్వీర్ బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. ఆదివారం జహీరాబాద్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సమర్థత ఉన్న నాయకుడు లేకనే..

ఇప్పటికే న్యాల్‌కల్ మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ చంద్రప్ప బీఆర్‌ఎస్‌ను వీడి జీవోపలె కాంగ్రెస్‌లో చేరారు. మొగుడంపల్లి మండలంలోనూ పలువురు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. బీఆర్‌ఎస్ నేతలను చేర్చుకునే ముహూర్తాన్ని త్వరలో ఖరారు చేయనున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. బీఆర్‌ఎస్‌లో లీడర్, క్యాడర్‌ను కాపాడుకునే సమర్థత ఉన్న నాయకుడు లేకపోవడమే పార్టీకి ఇబ్బందికరంగా మారిందనే అభిప్రాయాన్ని పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.

గెలుపే లక్ష్యంగా ముందుకు..

జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లో గెలుపొందాలనే ఉద్దేశ్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ పార్లమెంట్ స్థానంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ ఓట్లు అధికంగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఓట్లను కొల్లగొట్టే ప్రయత్నంలో ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి పెట్టి మూడోసారి జహీరాబాద్ స్థానాన్ని కైవసం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో నాయకులు, కార్యకర్తలతో టచ్‌లో ఉంటున్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో ఆయన స్థానంలో బీఆర్‌ఎస్ గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికల బరిలోకి దింపింది. బీజేపీ మాత్రం మోదీ చరిష్మానే నమ్ముకొని ముందుకు సాగుతోంది. బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ పోటీలో ఉన్నారు.

ఒక్క హామీ అమలు కాలేదు

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

హుస్నాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు కాలేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవనంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. నేటి రాజకీయాలు నేరపూరితంగా మారాయని, సగానికి సగం ఎంపీ, ఎమ్మెల్యేలు నేర చరిత్ర ఉన్నవారేనన్నారు. ప్రజా సేవకులు కనుమరుగు అయ్యారని తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ కల్పించిన ప్రాథమిక హక్కులు అమలు కావడం లేదన్నారు. తెలంగాణలో బీజేపీ పార్టీ పుంజుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. విభజన హామీలు ఏ ఒక్కటి అమలుకు నోచుకోలేదన్నారు. త్యాగాలు, బలిదానాల పునాదుల పై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్లు నిర్మించి కాల్వలు తవ్వారని, గౌరవెల్లి రిజర్వాయర్‌కు సంబంధించి కాల్వలు ఎందుకు తవ్వలేదని ప్రశ్నించారు. ఈ విషయం పై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టు, కాల్వల నిర్మాణం కోసం సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపే మల్లేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వనేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు అయిలేని సంజీవరెడ్డి, నాయకులు అయిలేని మల్లారెడ్డి, కాల్వల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు ఆపాలి

సీఐటీయూ నేత ఎల్లయ్య



కార్మికులతో మాట్లాడుతున్న ఎల్లయ్య

వర్గల్(గజ్వేల్): గౌరారం సత్యసూర్య పరిశ్రమలో కార్మికులపై యాజమాన్యం వేధింపులు ఆపాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం విధులు బహిష్కరించిన కార్మికులతో కలిసి పరిశ్రమ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యం కార్మికులను అకారణంగా, ముందస్తు సమాచారమివ్వకుండా గేటు వద్ద ఆపేయడం సరికాదన్నారు. పరిశ్రమలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వాపోయారు. కార్మికశాఖ, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేపట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేశ్, రవి, రాజు, సద్దాం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

నా చావుకు నేనే కారణం..

- మనస్తాపంతో ఉరి వేసుకొని యువతి ఆత్మహత్య
- విచారణ చేయొద్దని సూసైడ్ నోట్



శివానీ (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): ఉరివేసుకొని యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం ఉదయం సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని ఆరూర్ గ్రామానికి చెందిన మన్నే అశోక్ సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. అశోక్ పెద్ద కుమార్తె శివానీ(17) హైదరాబాద్‌లో బీఫార్మసీ చదువుతుంది. రెండు నెలల కిందట సదాశివపేటలోని ఇంటికి వచ్చింది. వచ్చినప్పటి నుంచి మనస్తాపంతో ఉంటున్న శివానీ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు యువతి రాసిన సూసైడ్‌నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. " నాకు ఇతరులకు సహాయపడటం చాలా ఇష్టం.. నా తల్లిదండ్రుల అనుమతితో నా అవయవాలను దానం చేయాలని కోరుతున్నా.. నేను లేకున్నా నా అవయవాల వల్ల మరో ఇద్దరు జీవిస్తారమోనని నా ఆశ.. నా చావుకు నేనే కారణం.. దయచేసి ఎలాంటి విచారణ చేయొద్దని లేఖలో పేర్కొన్నారు. బ్రెయిన్ డెడ్ కావడంతో అవయవాలు పనికిరావని వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేశ్ గౌడ్ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి



పుల్లయ్య మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని రైల్వేట్రాక్ సమీపంలో నివాసం ఉండే పుల్లయ్య(60) తెల్లాపూర్‌లోని రైల్వే స్టేషన్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే 7వ తేదీన డ్యూటీకి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పుల్లయ్య సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని మాక్స్‌సొసైటీ కాలనీ సమీపంలోని సబ్‌స్టేషన్ ఎదుట ఉన్న మురికి కాల్వలో శవమై కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ అనురాధ, పోలీసు అధికారులు

ఉక్కుపాదంతో అణచివేస్తాం

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో రూపొందించిన పోస్టర్‌ను సీపీ కార్యాలయంలో సీపీ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నిరోధించేందుకు ప్రతీ పౌరుడు కృషి చేయాలన్నారు. డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టీఎస్ నాబ్ తీవ్రంగా శ్రమిస్తుందన్నారు. కల్తీ కల్లు ఆల్ప్రాజోలం, డైజోపార్మా సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూం 87126 67100, రాష్ట్ర టోల్ ఫ్రీ నంబర్ 87126 71111, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రవీందర్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌గౌడ్, కిరణ్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, టూటౌన్ సీఐ ఉపేందర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి బట్టలు కొనేందుకు వెళ్తుండగా..

- ఆటోను ఢీకొట్టిన కారు
- బాలుడు మృతి, పలువురికి గాయాలు
- తూప్రాన్ సమీపంలోని నాగులపల్లి చౌరస్తా వద్ద ఘటన



కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

తూప్రాన్: పెళ్లి కోసం బట్టలు కొనేందుకు ఆటోలో పట్టణానికి వస్తున్న వారిని వెనుకాల నుంచి అతివేగంగా కారు ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10వ తరగతి బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన పట్టణ సమీపంలోని నాగులపల్లి చౌరస్తా వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన అంబార్‌పేట బాలక్రిష్ణ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. తన అన్న కూతురు వివాహం ఈ నెల 24న జరగాల్సి ఉంది. ఇందుకు తూప్రాన్ పట్టణంలో పెళ్లి బట్టలు కొనేందుకు ఆటోలు కుటుంబ సభ్యులతో కలిసి బయలు దేరారు. ఆటో నాగులపల్లి చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న హల్దీవాగుపైకి చేరుకోగానే వెనుకాల నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఆటోలో కూర్చున్న కుటుంబ సభ్యులు అందరూ రహదారిపై పడిపోయారు. బాలక్రిష్ణ పెద్ద కుమారుడు అఖిల్ తలపై నుంచి కారు పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బాలక్రిష్ణ అన్న యాదగిరి, వదిన మంజుల, భార్య రాధకు తీవ్ర గాయాలు అయ్యాయి. కారు డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. అతిగా మద్యం సేవించి కారును నడిపి తన కుమారుడి మృతికి కారకుడు అయిన తూప్రాన్ పట్టణ పరిధిలోని పోతరాజుపల్లి గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని మృతుని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. అఖిల్ ఇటీవలె 10వ తరగతి పరీక్ష రాశాడు.

పరామర్శించిన రఘునందన్‌రావు

బాలుడి మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులను బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పరామర్శించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకొని బాధితులను ఓదార్చారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి..

- యువకుడి దుర్మరణం



ప్రసాద్ మృతదేహం

ఇబ్రహీంపట్నం రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చుంచాన్ కోటకు చెందిన బంగారి ప్రసాద్(30) సైదాబాద్‌లో ఉంటూ క్యాటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మీర్‌పేట్‌లో క్యాటరింగ్‌కు వెళ్లిన ఆయన పనులు ముగిశాక కుర్మల్‌గూడలోని అత్తగారింటికి వెళ్తున్నాడు. ఎంపీఎస్ఆర్ కళాశాల వద్ద బైక్ అదుపుతప్పడంతో కల్వర్టును ఢీకొట్టి కిందపడిపోయాడు. తలకు తీవ్రగాయాలవ్వడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందినట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో ఉంది.

లారీ, బస్సు ఢీ

పలువురికి గాయాలు..

మనోహరాబాద్(తూప్రాన్): బస్సు, లారీ కొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాణిగంజ్ డిపోకు చెందిన బస్సు రామయంపేటకు వెళ్లి తిరిగి ప్రయాణికులతో సికింద్రాబాద్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో జాతీయ రహదారి-44పై మనోహరాబాద్ మండలం జీడిపల్లి వద్దకు రాగానే ముందు వెళ్తున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న సుమారు 24 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు సమాచారం రావడంతో ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఎవరి పరిస్థితి విషమంగా లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): ధ్వంసమైన బస్సు

రెండు కార్లు

కౌడిపల్లి(నర్సాపూర్): కారు టైర్ పంచర్ కావడంతో రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం దర్మాసాగర్‌తండా సమీపంలో 765డి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రామకోటిరెడ్డి కుటుంబ సభ్యులతో ఇన్నోవా కారులో మెదక్ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్తున్నారు. దర్మాసాగర్‌తండా సమీపంలోకి రాగా మెదక్ వైపు మరో వస్తుండగా టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇందులో ఓ కారు సైడ్ రెయిలింగ్‌ను ఢీకొని రోడ్డు కిందకు వెళ్లింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం కాలేదు.

కొను'గోడు'

- ప్రారంభం కాని వడ్ల కొనుగోలు
- మార్కెట్‌కు పోటెత్తుతున్న ధాన్యం
- నర్సాపూర్‌లో 27 కేంద్రాలు ఏర్పాటు
- తూకం కోసం రైతుల ఎదురుచూపులు
- వేధిస్తున్న హమాలీల కొరత



నర్సాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆరబోసిన వడ్లు

నర్సాపూర్ : రైతులు పండించిన ధాన్యం మధ్య దళారులకు అమ్మి నష్టపోవద్దని, వారికి ప్రభుత్వం మద్దతు ధరను కల్పించేందుకు రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకనుగుణంగా మండలంలో 27 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. కేంద్రాల ప్రారంభం బాగానే ఉన్నా.. వడ్లు మాత్రం ఇంకా తూకం వేయడం లేదు. దీంతో ధాన్యం మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు రోజుల వ్యవధి ఎదురు చూడక తప్పడం లేదు.

నర్సాపూర్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 17 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలో పది కొనుగోలు కేంద్రాలు ఇటీవల ప్రారంభించారు. మండలంలో ప్రభుత్వం 27 కేంద్రాలు ప్రారంభించినా సోమవారం నాటికి ధాన్యం తూకం వేసే పనులు ప్రారంభించలేదు. అన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం కుప్పలు కుప్పలుగా తెచ్చి ఆరబెడుతున్నా తూకం వేయడం లేదు. రోజూ వడ్లను ఆరపెడుతూ రాత్రి కాగానే కుప్పలు చేస్తున్నామని తేమ చూడడం లేదని, తూకం వేయడం లేదని, తమ వైపు కన్నెత్తి చూసే అధికారులే లేరని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలకు హమాలీలు రాలేదని తెలిసింది. హమాలీలు రానందున తూకం పనులు ప్రారంభించడం లేదని తెలిసింది. హమాలీలను సమకూర్చుకోవడంలో కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవరించడంతో హమాలీలు రాలేదని విమర్శలు వస్తున్నాయి.

వడ్లు తెచ్చి నాలుగు రోజులు..

నాలుగు రోజుల కిందట వడ్లను నర్సాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చామని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు చెబుతున్నారు. జయరాంతండాకు చెందిన మెగ్యానాయక్, నర్సింగ్‌నాయక్, లస్కర్, ఎల్లారెడ్డి గూడకు చెందిన గోపాల్, నారాయణపూర్‌కు చెందిన మహేశ్, రఘు తదితరులు మాట్లాడుతూ నాలుగు రోజుల కిందటే వడ్లను కేంద్రానికి తెచ్చామన్నారు. రోజు వడ్లను ఆరపెడ్తున్నామన్నారు. కాగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రాలేదని వడ్ల తేమని పరిశీలించలేదని వాపోతున్నారు. తేమ పరిశీలించి ఎక్కువ ఉందని చెబితే ఇంకా ఆరపెట్టేవారిమని, ఏ సమాచారం ఇవ్వనందున అందరం తమ వడ్లను ఎండ పెడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తేమను పరిశీలించండి తేమ సరిగా ఉన్న వడ్లను తూకం వేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తూకం వేయడం లేదు



ధాన్యం కొనాలని నిరసన తెలుపుతున్న రైతులు

చాలా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వడ్లు తేమగా ఉన్నాయని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం సీఈఓ వెంకటస్వామిగౌడ్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్ తెలిపారు. వడ్లలో తేమ ఎక్కువగా ఉన్నందున తూకం ప్రారంభించలేదని, మంగళ, బుధ వారాల నుంచి అంతటా తూకం ప్రారంభిస్తామని చెబుతున్నారు.